సాక్షి
జనగామ
శనివారం । 13 । జూలై । 2024



ఏడు దీవుల లక్నవరం

లక్నవరం సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. - 8లో▸



పనిచేసే అధికారులే రావాలి

పని చేయాలనే సంకల్పం ఉన్న అధికారులే ఏజెన్సీ గ్రామాలకు రావాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30^0 /25^0

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

రేపు ఉచిత వైద్యశిబిరం

జనగామ: జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డున ఉన్న ఏకశిల పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఈనెల 14న లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రీజియన్ చైర్మన్లు చందుపట్ల రవీందర్ రెడ్డి, కలువల భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరంలో ఎముకలు, కీళ్లు, కిడ్నీ, ఊపిరితిత్తులు, నరాలు, చిన్న పిల్లలు, స్త్రీల సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, బీపీ, షుగర్, నేత్ర వ్యాధులతోపాటు సాధారణ పరీక్షలు చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు కోఆర్డినేటర్లు రాజశేఖర్‌రెడ్డి(93467 35125), కృష్ణ జీవన్ బజాజ్(94416 97938), కుర్రెముల యాదగిరి(9848262702), శ్రీరామ్ శ్రీనివాస్(9849154859), పబ్బా చంద్రశేఖర్(9396700005)ను సంప్రదించాలని సూచించారు.

ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ: ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగాల కోసం ఇంటర్మీడియట్ చదివిన యువతీ యువకులు (అవివాహితులు) దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ వాయుసేన అగ్నిపత్ పథకం కింద ఇంటర్ లేదా సమాన స్థాయి విద్యార్హతలు ఉండి 50 శాతం మార్కులు, 2004 జూలై 3వ తేదీ నుంచి 2008 జనవరి 3 మధ్య కాలంలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. క్లరికల్, టెక్నికల్ ఉద్యోగాలకు http://agnipathvayu.cdac.ina వెబ్‌సైట్‌లో ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విజేతల ఎంపిక



జనగామ రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన పోస్టర్ మేకింగ్ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కాలేజీలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఛాగల్లు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.వర్షిని ప్రథమ, నర్మెట మోడల్ స్కూల్ విద్యార్థిని ఎస్.సంకీర్తన ద్వితీయ, తరిగొప్పుల ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.విశినిత తృతీయ బహుమతులు పొందారు. వారికి డీఈఓ కె.రాము నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, హెచ్‌ఎం మల్లికార్జున్, డ్రాయింగ్ మాస్టర్ హష్మతుల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్, సంగీత, మాధురి, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

జనగామ: పట్టణ పరిధి 33/11 కేవీ పాత సబ్ స్టేషన్, న్యూ కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా టౌన్‌లోని 30 వార్డులకు శనివారం(నేడు) ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని ఎన్పీడీసీఎల్ ఏఈ శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

స్కూళ్లలో సర్వీస్ పర్సన్లను నియమించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యాప్రమాణాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులతో పాటు సర్వీస్ పర్సన్లను నియమించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధి పలు ప్రభుత్వ పాఠశాలల్లో యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరగతి గదులను, పాఠశాలల పరిసరాలను శుభ్రం చేసే సిబ్బంది లేక అపరిశుభ్ర వాతావరణంలో పిల్లలు విద్యను అభ్యసించాల్సి వస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాష్, కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్, నీలకంఠం, రవి, సలావుద్దీన్, రాము, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

జనగామ రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం 8, 9వ తరగతి విద్యార్థులకు పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో పోస్టర్ మేకింగ్, కవితలు, రచనల పోటీలు నిర్వహించారు. మొత్తం 200 మంది పాల్గొనగా.. పోస్టర్ మేకింగ్‌లో బి.కీర్తి(సెయింట్ మేరీస్ పాఠశాల) ప్రథమ బహుమతి, కవితల పోటీలో ఆర్.అభినేత్రి(కేజీబీవీ బచ్చన్నపేట) గెలుపొందారు. వారికి డీఈఓ రాము సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌జీసీ కోఆర్డినేటర్ గౌసియా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్వర్టులపై పట్టింపేది..?

వరదలతో పొంచిఉన్న ప్రమాదం ◆ రోజుల తరబడి ప్రజలకు ఇబ్బందులు ◆ హడావుడితో సరిపెడుతున్న పాలకులు ◆ ఆ తర్వాత పట్టించుకునే దిక్కులేదు

ఏటా వానాకాలం వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోవడం జిల్లాలో సర్వసాధారణమైంది. కోతకు గురయ్యే లో లెవల్ కల్వర్టులు.. ప్రమాదకరంగా ఉన్న వంతెనలపై పాలకులకు పట్టింపు లేకుండా పోయింది. అనేక ప్రాంతాల్లో కల్వర్టుల పైనుంచి వరద ప్రవహించడంతో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. వరదలు వచ్చిన సమయంలో హడావుడితో సరిపెడుతున్న పాలకులు ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. ప్రస్తుత సీజన్‌లో ఇంకా భారీ వర్షాలు కురవలేదు. ముందస్తు చర్యలు చేపడితే ప్రజలకు రవాణా సమస్యలు తొలగించే అవకాశం ఉంటుంది. - జనగామ

మత్తడి పోస్తే సాగని రవాణా..

నర్మెట : నర్మెట-వెల్దండ చెరువు మత్తడి పోసిన సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అమ్మాపురం-మద్దూరు మండలం వంగపల్లి, ఆగపేట-రత్నతండా, మల్కపేట-దూప్యాతండా నుంచి సూర్యబండతండా మీదుగా మేకలగట్టు ఖిలాషాపూర్, వెల్దండ-కేసీరెడ్డిపల్లి, బచ్చన్నపేట-కొడవటూరు గ్రామాలకు వెళ్లే రహదారుల మధ్య ఉన్న కల్వర్లు, కట్టలు తెగిన సమయంలో రాకపోకలు స్తంభించే అవకాశం ఉంది.



నర్మెట-వెల్దండ మధ్య కోతకు గురైన కట్ట

చెరువు నిండితే అంతే సంగతులు..



బంజర-పెద్ద తండాల మధ్య కల్వర్టు

దేవరుప్పుల: వర్షాకాలం బంజర, పెద్దతండాలకు సంబంధించి రోడ్డు కల్వర్టులు ముంపునకు గురికావడంతో రవాణా సౌకర్యం నిలిచిపోతుంది. జనగామ-సూర్యాపేట రహదారి నుంచి బంజరకు వచ్చే గ్రామ సమీప చెరువు నిండితే వాహనాలు కల్వర్టు దాటని పరిస్థితి నెలకొంటుంది. వనపర్తి మీదుగా నేలపోగుల ద్వారా రావాల్సి ఉంటుంది. కోలుకొండ సబ్‌స్టేషన్ పరిధి కల్వర్టులకు వరద నీరు చేరితే పాదచారులు సైతం వెళ్లలేని పరిస్థితి. శాతాపురం మీదుగా మాదాపురం నుంచి వెళ్లాలనుకుంటే ఆ గ్రామ చెరువు మత్తడితో ఇబ్బందులు ఉంటాయి.

శాశ్వత చర్యలు శూన్యం

తరిగొప్పుల: భారీ వర్షాలు కురిస్తే మండల కేంద్రం నుంచి జనగామకు వెళ్లే ప్రధాన రహదారి పెద్ద చెరువు పెద్ద మత్తడి వద్ద వరద పెరుగుతుంది. వాహనాలను నర్సాపూర్ మీదుగా మళ్లిస్తున్నారు. పోతారం-సోలిపురం మధ్య కల్వర్టు నిర్మించారు. ప్రవాహానికి భిన్నంగా కల్వర్టు నిర్మాణం ఉండడంతో వరద నీరు పంట పొలాల మీదుగా చిన్న మత్తడి నుంచి వెళ్లేది. గత సీజన్‌లో చిన్నమత్తడి సైతం కోతకు గురికావడంతో వరద రోడ్డు పైకి వచ్చి వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు.



కోతకు గురైన సోలిపురం-పోతారం మధ్య కల్వర్టు



జనగామ రూరల్: గత సీజన్‌లో వరద ప్రవాహానికి కొట్టుకు పోయిన చీటకోడూరు బ్రిడ్జి

పూర్తికాని కల్వర్టు పనులు

జనగామ రూరల్: జనగామ-హుస్నాబాద్(నర్మెట)కు వెళ్లే ప్రధాన రహదారి గానుగుపహాడ్ కల్వర్టు పనులు ఏడాది గడిచినా పూర్తి కాలేదు. గత ఏడాది భారీ వర్షాలకు గానుగుపహాడ్ బ్రిడ్జి కొట్టుకు పోవడంతో మూడు నెలల పాటు ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు మళ్లించారు. వాహనదారుల కోసం భూమి ఇచ్చిన వ్యక్తి రాకపోకలను నిలిపి వేయించగా.. గానుగుపహాడ్ కల్వర్టు మీదుగా సాగించడంతో వాగు దెబ్బ తింటుందని అక్కడ కూడా నిలిపి వేశారు. ప్రస్తుతం తాత్కాలికంగా వేసిన ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. దీని పైనుంచి నర్మెట, తరిగొప్పుల మీదుగా హుస్నాబాద్, కరీంనగర్‌కు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అలాగే చీటకోడూరు కల్వర్టు గత వానాకాలం కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. మరిగడి నుంచి రఘునాథపల్లి, నర్మెటకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో చుట్టూ పది గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



జనగామ రూరల్: ప్రమాదకరంగా మారిన గానుగుపహాడ్ తాత్కాలిక రోడ్డు

చౌడారంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాల, మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఇంటికే పరిమితమవుతున్నారు. రెండు వంతెనల నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే ఇబ్బంది ఉండదు.

సాక్షి పరిశీలన

దారి మళ్లింపుతో ఇబ్బందులు

లింగాలగణపురం: జీడికల్ రహదారిలో బండ్లగూడ వద్ద చెరువు మత్తడి ప్రవాహంతో గుమ్మడవెల్లి-జీడికల్ గ్రామాల రహదారిపై రాకపోకలు నిలిచిపోతాయి. క్లోం-జీడికల్ రోడ్డులో క్లోం చెరువు మత్తడి పోస్తే సిరిపురం-జీడికల్ గ్రామాల మధ్య ఇదే పరిస్థితి. వనపర్తి-కొత్తపల్లి మధ్య కల్వర్టు లేదు. వనపర్తి చెరువు మత్తడితో రెండు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు. కుందారం-పాలకుర్తి రోడ్డులో పటేల్‌గూడెం కల్వర్టు వద్ద వాగు మత్తడి పోస్తే పాలకుర్తికి వెళ్లడానికి దారి మళ్లించాల్సి వస్తున్నది.



బండ్లగూడెం వద్ద కల్వర్టు లేని రహదారి

వాగు నుంచే ప్రయాణం..

రఘునాథపల్లి : మండల పరిధిలోని మాదారం గ్రామం నుంచి దాసన్నగూడెం వెళ్లేరోడ్డు మధ్య ఖిలాషాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచి పోతాయి. ఇబ్రహీంపూర్ మధ్యలోని పెద్ద చెరువు చిన్న మత్తడి వద్ద వంతెన లేకపోవడంతో ప్రజలు వాగు నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. చిన్న మత్తడి అలుగు పోస్తే ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రోజుల తరబడి ఇంటికే పరిమితం కావాల్సి వస్తున్నది. కోడూరు చెరువు అలుగుతో రామన్నగూడెంకు రాకపోకలు నిలిచిపోతాయి. మాదారం-ఖిలాషాపూర్ మధ్య బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో పలు గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

చుట్టూ తిరిగి వెళ్లాల్సిదే..



నల్లబండ వద్ద లోలెవల్ కల్వర్టు

జఫర్‌గఢ్ : మండల కేంద్రం నుంచి ఓబులాపూర్, తమ్మడపల్లి(జి), మగ్గంతండా, షాపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిలో నల్లబండ సమీపం రహదారిపై లోలెవల్ కల్వర్టు ఉంది. భారీ వర్షాలకు పెద్ద చెరువు అలియాబాద్‌కుంట, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వరదతో రాకపోకలు నిలిచిపోతాయి. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తున్నది.

మత్తడి పోస్తే.. రాకపోకలు బంద్



చిల్పూరు: లోలెవల్ కల్వర్టు

చిల్పూరు: గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకోవాలంటే బ్రెంకల చెరువు లోలెవల్ కల్వర్టు మత్తడి మీదుగా రావాలి. చెరువు మత్తడి పోసిన సమయంలో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

ఐదు కిలోమీటర్లు అదనం..



భారీ వర్షాలు కురిస్తే అధికారులు రాకపోకలు నిలిపి వేస్తారు. చిల్పూరుగుట్ట నుంచి మండల కేంద్రానికి కిలోమీటరు దూరం ఉండగా.. వరద ముప్పుతో ఐదు కిలోమీటర్లు అదనంగా తిరిగి వెళ్లాల్సి వస్తున్నది.

- గణగోని రమేష్, వాహన చోదకుడు

రోజుల తరబడి ఇబ్బంది



ఎల్లమ్మ ఆలయం సమీపంలో లోలెవల్ కల్వర్టు

బచ్చన్నపేట : బచ్చన్నపేట-కొన్నె ప్రధాన రహదారి.. లింగంపల్లి రూట్‌లోని నక్కవానిగూడెం, ఇటుకాలపల్లి, రామచంద్రాపురం, కొన్నె, దబ్బగుంటపల్లి, లింగంపల్లి, పడమటికేశ్వాపూర్, మన్‌సాన్‌పల్లి, సాల్వాపూర్, సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రధాన రహదారి ఎల్లమ్మగుడి సమీప లోలెవల్ కల్వర్టు వద్ద వరద ఉధృతితో రోజుల తరబడి రాకపోకలు నిలిచి పోతాయి. కేశిరెడ్డిపల్లి నుంచి వెల్దండ వెళ్లే మార్గంలో కల్వర్టు పరిస్థితి అలానే ఉంది.

నూతన బ్రిడ్జి నిర్మాణం చేయాలి



బచ్చన్నపేట సమీపంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపడితే వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది ఉండదు. వర్షాలు కురిసిన సమయంలో ప్రయాణం నిలిచిపోయి అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

- ఎండీ.రాజ్ మహమ్మద్, ఇటికాలపల్లి

కల్వర్టు నిర్మిస్తేనే రాకపోకలు



ఈరవెన్ను గ్రామం వద్ద లోలెవల్ కల్వర్టు

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: మండలం కేంద్రం నుంచి దర్దెపల్లి మధ్యలో లో-లెవల్ కల్వర్టు నిర్మించారు. పాలకుర్తి చెరువు నిండి మత్తడి పోస్తే తొర్రూరుకు రాకపోకలు నిలిచిపోతాయి. లో-లెవల్ కల్వర్టు సమీపంలో బ్రిడ్జి నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామానికి వెళ్లే దారిలో లో-లెవల్ కల్వర్టు వద్ద వాగు ప్రవహించిన సమయంలో గ్రామానికి రాకపోకలు ఆగిపోతాయి. పాలకుర్తి నుంచి ఈరవెన్ను, జనగామ వెళ్లే ప్రధాన రహదారిలో లక్ష్మీనారాయణపురం గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన లోలెవల్ కల్వర్టు వద్ద ఇదే పరిస్థితి ఉంది.

వాగుపై వంతెన నిర్మించాలి



వరద ప్రవాహంతో ఏటా రాఘవాపురం గ్రామానికి రాకపోకలు నిలిచి పోతున్నాయి. పాలకుర్తి నుంచి వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లడానికి ఇబ్బంది తప్పడం లేదు. ప్రభుత్వం వాగుపై బ్రిడ్జి నిర్మించాలి.

- ముస్కు కొమురయ్య, రాఘవాపురం

అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి ఆసక్తి ఉన్నరంగాల్లో యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా గతంలో నాటిన మొక్కల ప్రగతిని తెలుసుకుంటూ లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలల ఆరోగ్యాన్ని పరిశీలించి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రపరుస్తూ తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని పేర్కొన్నారు. గతంలో డెంగీ, మలేరియా జ్వరాలు వచ్చిన ప్రాంతాలపై దృష్టి పెట్టి నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు విధులను పక్కాగా నిర్వహించి, చేపట్టిన పనులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీఆర్‌డీఓ మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

పర్యావరణాన్ని పరిరక్షించాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణాన్ని పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన ప్రకృతిని అందించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్‌బాషా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు వాటర్‌ప్లాంట్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. జిల్లాలో కోటి మొక్కలు నాటడం లక్ష్యంగా పనిచేయాలని కోరారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరో రెండు కోర్సులు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీఎఫ్‌ఓ లావణ్య, సీఈఓ అనిల్, డీఆర్‌డీఓ మొగులప్ప, ఏసీపీ భీమ్ శర్మ, ఆర్‌డీఓ వెంకన్న, డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ఖజానా ఖాళీ చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

చిల్పూరు: తెలంగాణ అభివృద్ధి పేరుతో బీఆర్‌ఎస్ సర్కారు 10 ఏళ్లలో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న అధ్యక్షతన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి పంపిణీ చేశారు.

ప్రాణాలు తీస్తున్న రెండు ఫీడర్లు

ఒకే స్తంభానికి రెండు ఫీడర్ల ఏర్పాటు

- మూడు నెలల వ్యవధిలో ఇద్దరి దుర్మరణం
- ట్రాన్స్‌కో అధికారుల తీరుపై వనపర్తి గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం



విద్యుత్ స్తంభంపై మల్లేశం మృత దేహం



దుర్గమ్మగుడి ప్రాంతంలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

లింగాలఘణపురం: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వనపర్తిలో మూడు నెలల వ్యవధిలో రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎంత చెప్పినా పట్టించుకోలేదు. ఫలితంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ట్రాన్స్‌కో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ హెల్పర్ కుక్కల మల్లేశం(43) శుక్రవారం స్తంభం ఎక్కి సర్వీసు వైరు మరమ్మతు చేస్తుండగా విద్యుత్ సరఫరా అయి అక్కడే ప్రాణాలొదిలాడు. ఒకే స్తంభానికి రెండు ఫీడర్లు ఉండడంతో ఈ ఘటన జరిగింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది మార్చి 5వ తేదీన వనపర్తికి చెందిన కట్టర్ మహేందర్‌రెడ్డి(38) ఎల్‌సీ తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫీజు వేస్తున్నాడు. ఒకే స్తంభానికి రెండు ఫీడర్లు ఉండడంతో మరో ఫీడర్‌కు విద్యుత్ సరఫరా జరిగి ప్రాణాలు కోల్పోయాడు. నిండు గర్భిణి అయిన భార్యకు, కుటుంబానికి న్యాయం చేయాలంటూ జనగామ-సూర్యాపేట రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఇప్పటికీ ఆ కుటుంబానికి ఎలాంటి నష్టపరిహారం అందలేదు. తిరిగి మూడు నెలలు గడవకముందే ప్రైవేట్ హెల్పర్ మల్లేశం మృతి చెందడం గమనార్హం. అంతేకాకుండా ఇటీవల గోలి రాజిరెడ్డికి చెందిన పాడిగేదె విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడింది. ఇలా గ్రామంలో విద్యుత్ వైర్లు సరిగా లేక ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.



ఇటీవల మృతిచెందిన మహేందర్‌రెడ్డి(ఫైల్)

సబ్‌స్టేషన్ ఏర్పాటు నుంచి అలాగే ఉంది..

వనపర్తిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఒకే స్తంభంపై రెండు ఫీడర్లు ఉన్నాయి. ఒకటి వనపర్తి, మరొకటి నేలపోగుల. అప్పటి అధికారులు వనపర్తికి ప్రత్యేక లైన్ వేసి ఫీడర్ ఏర్పాటు చేయాల్సి ఉండేది.. అలా చేయలేదు. అదే కొనసాగుతోంది. ఇటీవల కట్టర్ విద్యుత్ ప్రమాదంలో చనిపోవడంతో లైన్‌మెన్ సస్పెండ్ అయ్యాడు. అక్కడ పని చేసేందుకు సిబ్బంది కూడా ఎవరు లేరు. ఒక ఫీడర్‌కు జేఎల్‌ఎం ఎల్‌సీ ఇవ్వమంటే ఇచ్చాను.. అంతవరకే నా బాధ్యత.

- శంకరయ్య, ఏఈ, లింగాలఘణపురం

‘ఫీజు రీయింబర్స్’ విడుదల చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ కలెక్టరేట్ ముట్టడి

జనగామ రూరల్/జనగామ: ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం మాట్లాడుతూ.. ఆరేళ్ల నుంచి విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదని, 2019 నుంచి స్కాలర్ షిప్స్ బకాయిలు పేరుకుపోయాయన్నారు. అవన్నీ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్, నాయకులు యాకన్న రాథోడ్, దాసగాని సుమా, లవకుమార్ ఆర్యా, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

క్లుప్తంగా

సన్న బియ్యం పేరుతో మోసం

కాజీపేట: తక్కువ ధరలకే సన్నబియ్యం విక్రయిస్తామంటూ కొంతమంది వ్యక్తులు రేషన్ బియ్యం అంటగట్టి పలువురి నుంచి డబ్బులు కాజేసిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ టాటా ఏస్ వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు బీపీటీ సన్న రకం బియ్యం అంటూ 25 కిలోల బస్తాను చూపిస్తూ బియ్యాన్ని విక్రయించారు. సాధారణంగా మార్కెట్‌లో 25కిలోల సన్న బియ్యం బస్తా ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,500వరకు ఉంది. కానీ సదరు వ్యక్తులు రూ.1,000కే విక్రయించడంతో తక్కువ ధరకు వస్తుందని పలువురు ఎగబడి కొన్నారు. వారికి అనుమానం రాకుండా బియ్యం బస్తా పైభాగంలో ఉన్న బియ్యాన్ని చూపించి బురిడీ కొట్టించారు. తమ సెల్‌ఫోన్ నంబర్లను సైతం ఇచ్చి వారిని నమ్మించారు. బాధితులు ఇంట్లో బియ్యం బస్తా విప్పి చూడగా అందులోని పైభాగంలో మాత్రమే కొంతమేర సన్న బియ్యం ఉండగా కింద భాగమంతా రేషన్ బియ్యం ఉండడం చూసి కంగుతిన్నారు. దీంతో వారు ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్లకు కాల్ చేయగా.. స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఆవేదనకు గురై చేసేదిలేక మిన్నకుండిపోయారు.

'జెన్‌కో' అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించే టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గీసుకొండ : గ్రేటర్ పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాక మాస్టర్‌జీ పాఠశాలకు వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తి(38) హత్యకు గురయ్యాడు. గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. జాన్‌పాకలో బలగాని అనిల్ ఇంటి నిర్మాణం పనులను చేపడుతున్నాడు. ఇందులో భాగంగా ఇంటి ఎదుట ఇసుక కుప్పను పోసుకున్నాడు. అడ్డా కూలీగా ఉన్న ఓ వ్యక్తి ఇంటి పని నిమిత్తం వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం బలగాల అనిల్‌కు ఇసుక కుప్పలో కూలీ మృతదేహం కనపడటంతో పోలీసులకు సమాచారం అందించాడు. అతడిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి రాయితో తలపై మోది హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుడు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వాడిగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గీసుకొండ సీఐ బాబూలాల్ సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85031, 87126 85240 సెల్‌నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. మృతుడి వివరాలు తెలిస్తే అతడిని హత్య చేసింది ఎవరో తెలుసుకోవచ్చని సీఐ తెలిపారు.

ఏడు దీవుల లక్నవరం

ఆహ్లాదాన్ని పంచుతున్న సరస్సు, పరిసరాలు

- పర్యాటకులకు అందుబాటులో మూడు దీవులు
- మిగతా దీవులపై కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- అటవీ శాఖ ఉద్యానవనంలో జింకలు, చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటు
- దృష్టి సారిస్తే టూరిజం సెంట్రల్ పాయింట్‌గా గుర్తింపు


లక్నవరం వ్యూ (ఫైల్)

గోవిందరావుపేట: ప్రకృతి సహజసిద్ధ సోయగం.. ఏడుదీవుల వరం.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని లక్నవరం. వరంగల్ – భూపాలపట్నం జాతీయ రహదారి 163 నుంచి బూస్సాపూర్ గ్రామం మీదుగా సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నవరం సరస్సు పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర సమయంలో జంపన్నవాగులోకి లక్నవరం సరస్సు నీటినే వదులుతారు.

హరిత హోటళ్లు..

టూరిస్టులు ఉండటానికి సరస్సు మధ్యలో హరిత హోటళ్లు ఉన్నాయి. ప్రైవేట్ సదుపాయాలు కూడా ఉంటాయి. హరిత హోటళ్లలో డార్మిటరీ రూమ్స్ ఏసీ, నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉంటాయి. గ్లాస్ రూమ్స్ కూడా ఉన్నాయి. ఈ గదుల వినియోగానికి ఒకరోజుకు రూ.2,000 నుంచి రూ.5,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉండడం వల్ల ఆన్‌లైన్ లో కూడా టికెట్స్ అందుబాటులో ఉంచారు. ఫుడ్ కోసం రెస్టారెంట్‌లు కూడా ఉన్నాయి. లక్నవరంలో మూడు దీవుల్లో ప్రస్తుతం పర్యాటకులకు ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మిగతా దీవుల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

మనసు దోచే ఊయల వంతెన..

లక్నవరం సరస్సు అందాలు చూడాలన్నా.. వర్ణించాలన్నా.. ఒక్కసారైనా పర్యటించాల్సిందే.. సరస్సు నీటిలో తేలియాడుతున్నట్లుగా ఊయల వంతెన పై నడుస్తూ చుట్టూ ఉన్న కొండలు, దీవులను చూస్తే కలిగే ఆనందం వర్ణనాతీతం. సరస్సులో బోటింగ్ చేస్తే వచ్చే హుషారే వేరంటారు.. పర్యాటకులు. కాకతీయ రాజులు ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి చేసిన ఈ సరస్సు సుమారు 5వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం.. 10వేలు, అనధికారికంగా మరో పదివేల ఎకరాలకు పైగా సరస్సు నీటితో వ్యవసాయ సాగుజరుగుతోంది. ప్రస్తుతం సరస్సు అభివృద్ధిపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. బ్రిడ్జి మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే గిరీశ్ భరద్వాజ్ డిజైన్ చేసిన ఈ బ్రిడ్జి ఆధారంగా ప్రభుత్వం మరో బ్రిడ్జిని నిర్మించింది.

ఆదాయం, ఆహ్లాదం..

వివిధ ప్రాంతాల నుంచి లక్నవరం వచ్చే పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని, వన్య ప్రాణులను దగ్గర నుంచి చూసే అవకాశాన్ని కల్పించాలనే ఆలోచనతో అటవీ శాఖ అధికారులు చేసిన కార్యచరణ అద్భుతం. 2019లో పునరావాస కేంద్రంతోపాటు అటవీ శాఖ ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో దుప్పుల పునరావాస కేంద్రం కింద అటవీ శాఖ అధికారులు 20దుప్పులు, జింకలకు పకడ్బందీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పునరావాస పునరుత్పత్తి ఏర్పాటు చేశారు. అందుకు అనుగుణంగా లక్నవరం తరలివచ్చే వేలాది మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు అటవీ శాఖ ఉద్యానవనం పేరుతో అద్భుతమైన పార్కును తీర్చిదిద్దారు. ఇందులో రూ.7.50లక్షల ఎంపీ నిధులతో చిల్డ్రన్స్ పార్కును సైతం ఏర్పాటు చేశారు. ఈ ఉద్యానవనం సందర్శించేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 టికెట్ ఏర్పాటు చేసి ఆ నిధులతో మెయింటెన్స్ చేసేందుకు కార్యచరణ రూపొందించారు.


అటవీశాఖ పర్యావరణ ఉద్యానవనం


అడవిలో నుంచి లక్నవరం సరస్సుకు దారి

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- రక్షణతోపాటు ఉద్యోగం కల్పిస్తాం
- పదహారు చింతల్ తండా బాధితులకు ఎమ్మెల్యే దొంతి పరామర్శ

చెన్నారావుపేట: తల్లి దండ్రులను కోల్పోయి ఒంటరైన పిల్లలకు అండగా ఉంటానని, అధైర్య పడొద్దని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభయమిచ్చారు. ఈ మేరకు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారు చింతల్ తండాలో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన శ్రీనివాస్, సుగుణ దంపతుల పిల్లలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి శుక్రవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హంతకుడు నాగరాజుకు శిక్ష పడేలా చూస్తానని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు ప్రభుత్వం తరఫున ఖర్చుల నిమిత్తం రూ.4.25లక్షలు అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తామని తెలిపారు. పిల్లల చదువులు, వారి రక్షణకు ప్రభుత్వం బాధ్యత తీసుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా బంధువులు, గ్రామస్తులు నిందితుడిని ఉరి తీయాలని, తనకు ఉద్యోగం ఇప్పించాలని బాధితురాలు దీపిక ఎమ్మెల్యే మాధవరెడ్డిని వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కలపెల్లి రవీందర్‌రావు, పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఈ భయానక ఘటన నుంచి తండా ప్రజలు ఇంకా తేరుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా సీఐ చంద్రమోహన్, ఎస్సై అరుణ్, జనగామ ఎస్సై రాజేష్‌కుమార్‌లు రేయింబవళ్లు తండాలో పికెటింగ్, బందోబస్త్ ఏర్పాటు చేశారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య


గణేశ్ (ఫైల్)

బచ్చన్నపేట: మండలంలోని పడమటి కేశ్వాపూర్ గ్రామానికి చెందిన గిద్దెల గణేశ్ (20) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గిద్దెల మేఘమాల, బాలయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో గణేశ్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో కొన్ని రోజులుగా బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు, కుటుంబ సభ్యులు వెతకగా సమీప వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని కన్పించాడు. దీంతో గణేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలం వద్దకు ఎస్సై సతీష్‌కుమార్ చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, బస్సు ఢీ: 15 మందికి గాయాలు


ప్రమాదస్థలంలో బస్సు, లారీ

ములుగు రూరల్: ములుగు జిల్లా పందికుంట –మల్లంపల్లి మధ్యలో శుక్రవారం ఉదయం లారీ, బస్సు ఢీ కొన్న ఘటనలో 15మంది గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించి, వివరాలిలా ఉన్నాయి.. ములుగు నుంచి హనుమకొండకు ఆర్టీసీ అద్దె బస్సు 33మంది ప్రయాణికులతో వెళ్తున్న క్రమంలో హనుమకొండ వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 15మంది ప్రయాణికులు, కండక్టర్‌కు గాయాలయ్యాయి. గాయాలైన వారిని అంబులెన్స్‌లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒకరిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిగతా వారు ములుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ బోయపల్లి మహేశ్‌పై ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ విజయభాను తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. రోడ్డు మరమ్మతు పనుల్లో భాగంగా వన్‌వే ఏర్పాటు చేశారు. ఈక్రమంలో పందికుంట వద్ద లారీ డ్రైవర్ అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో బస్సును ఢీ కొట్టాడు. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగలేదని అన్నారు. గాయపడిన వారిని ఆర్‌ఎం ములుగు ఏరియా ఆస్పత్రిలో పరామర్శించినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ రీజనల్ మేనేజర్ భాను కిరణ్, వరంగల్ డీఎంలు సురేష్, మోహన్‌రావు, ఎస్టీఐ కుమార్ తదితరులు ఉన్నారు.

పనిచేసే అధికారులే ఏజెన్సీకి రావాలి

- ప్రజా దర్బార్‌లో మంత్రి సీతక్క
- రైతు భరోసా అందించాలని అధికంగా వినతులు


ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ

కొత్తగూడ: పని చేయాలనే సంకల్పం ఉన్న అధికారులే ఏజెన్సీ గ్రామాలకు రావాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మానుకోట జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్(గ్రీవెన్స్)లో ఆమె మాట్లాడారు. కొత్తగూడ, గంగారం, గూడూరు, మహబూబాబాద్, బయ్యారం మండలాల ప్రజలు మంత్రి సీతక్కకు వినతిపత్రాలు అందజేశారు. ఎక్కువగా రైతు భరోసా డబ్బులు అందించాలని వినతులు అందించారు. మండలంలో రికార్డుల ప్రక్షాళన సమయంలో ఫారెస్టు అధికారుల వల్ల పట్టాలు రద్దయ్యాయని, సర్వేలో రెవెన్యూ భూమి అని తేలినా హక్కు పత్రాలు ఇవ్వలేదని పలువురు వినతిపత్రం అందజేశారు. వెంటనే పట్టాలు జారీ అయ్యేలా చూడాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు మంత్రి సూచించారు. గంగారం, కొత్తగూడ మండలాల్లో కొత్తగా పోడు జరగకుండా, సాగులో ఉన్న పాత భూముల్లో వ్యవసాయానికి ఆటంకం లేకుండా చూడాలని జిల్లా ఫారెస్ట్ అధికారి బత్తుల విశాల్‌కు సూచించారు. గూడూరు మండలంలో ఈఎంఆర్‌ఎస్ పాఠశాలకు తమ భూములను బలవంతంగా లాక్కున్నారని బాధితులు వినతిపత్రం అందించగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

స్టేజి దిగివచ్చి..

బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు వట్టం సైదమ్మ వినతిపత్రం ఇచ్చేందుకు ఇబ్బంది పడుతూ రావడం చూసిన మంత్రి సీతక్క స్టేజి దిగి ఆమె వద్దకు వెళ్లి వినతి పత్రం తీసుకున్నారు.

శభాష్ పోలీస్..


చంటిపాపను లాలిస్తున్న మహిళా పోలీస్

మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన ఓ దివ్యాంగురాలిని మహిళా పోలీసులు ఎత్తుకుని తీసుకెళ్లారు. అలాగే వినతిపత్రం ఇవ్వడానికి చంటిపిల్లతో ఓ తల్లి వచ్చింది. ఈక్రమంలో ఆమె వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా.. పాపను ఓ కానిస్టేబుల్ ఎత్తుకుని లాలించింది.

యువతను చైతన్యం చేయాలి..

యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా చైతన్యం చేయాలని అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీతక్క సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వేలుబెల్లి సమీపంలోని కత్తెర్ల వాగుపై నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాంనాథ్ కేకన్, ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర, ట్రాన్స్ కో ఎస్ఈ నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంజేపీలో ర్యాగింగ్

భరించలేక తప్పించుకున్న 19 మంది పిల్లలు

- ఐదు కిలోమీటర్ల దూరంలోని పాత ఎంజేపీకి రాక
- హాస్టల్ వద్ద ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు
- ప్రిన్సిపాల్, టీచర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం


ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

జనగామ: సీనియర్, జూనియర్ విద్యార్థుల ర్యాగింగ్.. గెస్ట్ టీచర్ల వెటకారం మాటలు.. చీటికి మాటికి ఫిర్యాదులతో విసిగిపోయిన 19 మంది విద్యార్థులు గోడదూకి తప్పించుకున్న ఘటన పెంబర్తి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో శుక్రవారం జరిగింది. బాధిత విద్యార్థులు బాలాజీ, టి.సాత్విక్, వి.నకిరానందన్, ఎం.భరత్, బి.విగ్నేష్, కార్తీక్, వినయ్, ఎం.రామ్‌చరణ్, ఎస్.శ్రీచరణ్, టి.విగ్నేష్, సీహెచ్.రామ్‌చరణ్, రుషి, హవీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రం ధర్మకంచ రైల్వేట్రాక్ ఏరియాలోని బాలుర ఎంజేపీలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడంతో 154 మంది(8, 9వ తరగతి)ని పెంబర్తి ఎంజేపీ(బచ్చన్నపేటకు చెందిన)లో 20 రోజుల క్రితం చేర్పించారు. ఇక్కడి సీనియర్, జూనియర్ విద్యార్థులు ఇటీవల వచ్చిన పిల్లలను ర్యాగింగ్ చేస్తున్నారు. వాటర్ సంప్‌లో అపరిశుభ్రత వాతావరణం కలిగేలా చేయడంతో వద్దని జనగామ నుంచి వెళ్లిన విద్యార్థులు వారించగా.. వారిని వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. సంప్ వాటర్ అపరిశుభ్రం కావడంతో పైపులైన్ వద్ద బకెట్లతో నీరు తెచ్చుకుని కాలకృత్యాలు తీర్చుకుంటున్నామని బాధిత విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు సైతం ప్రేయర్‌లో జనగామ బాయ్స్ బ్యాడ్ అనేలా వ్యవహరించారని కన్నీటి పర్యంతమయ్యారు. గెస్ట్ టీచర్లు బూతులు మాట్లాడుతూ అవహేళన చేశారని ఆరోపించారు. ఈ విషయమై కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్‌కు చెప్పినా పట్టించుకోలేదని, ఏ సంఘటన జరిగినా తమను బాధ్యులను చేస్తున్నారని వాపోయారు. ఇక అక్కడ ఉండకూడదని నిర్ణయించుకుని తెల్లవారుజామున గోడదూకి కాలినడకన సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జనగామ పాత ఎంజేపీకి వచ్చేసినట్లు వివరించారు. పెంబర్తి గురుకులంలో భోజనం, కూర, చారు కూడా నాణ్యత లేక ఒక్క పూట కూడా తినలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పిల్లలు పారిపోయారని సమాచారం అందుకున్న తల్లిదండ్రులు గురుకులం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను కొత్తగా వచ్చాను..



పెంబర్తి ఎంజేపీకి ఇటీవలే వచ్చాను. జూన్‌లో 154 మంది పిల్లలు జనగామ నుంచి వచ్చారు. గొడవలు జరిగే విషయం నాకు తెలియదు. అయినా రోజూ నిఘా ఉంటుంది. నైట్ వాచ్‌మన్ పర్యవేక్షిస్తారు. పిల్లలు ప్లాన్ చేసిన సంగతి పసిగట్ట లేక పోయాం. ర్యాగింగ్‌పై విచారణ చేయిస్తాం. అటువంటిది జరగలేదని అనుకుంటున్నాం. పై అధికారులకు సమాచారం ఇచ్చాం.

– చంద్రమౌళి, పెంబర్తి ఎంజేపీ ప్రిన్సిపాల్

క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి
- ముగిసిన రీజినల్ స్పోర్ట్స్ మీట్


విజేతలను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి

కాజీపేట అర్బన్ : క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి అన్నారు. కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో నిర్వహిస్తున్న తెలంగాణ, ఏపీ రీజినల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో టేబుల్ టెన్నిస్ విభాగంలో అండర్–14 విభాగంలో బాయ్స్ అండ్ గర్ల్స్ కేవీ వాల్తేరు ప్రథమ స్థానంలో నిలిచారు, అండర్–17 విభాగంలో కేవీ వాల్తేరు బాలికలు, కేవీ తిరుపతి బాలురు ప్రథమ స్థానంలో, అండర్–19 విభాగంలో కేవీ విశాఖపట్నం బాలికలు, ఒంగోలు బాలురు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వరంగల్ విద్యార్థులు కె.అనంతశ్రీ, పి.శ్రీజ, సిహెచ్.సూర్య, కె.కోదండ రామ్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విజేతలను, జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సుభాషిణి అభినందించారు. కార్యక్రమంలో కేవీ పీఈడీ కొర్ర శ్రీనివాస్, హైదరాబాద్ రీజియన్ పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు తరలించకపోతే తడాఖా చూపిస్తాం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

నల్లబెల్లి: అశ్వారావుపేటలో ఎస్సైగా పనిచేసిన శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన సీఐ జితేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బందిని 24 గంటలలోపు ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించకపోతే మా తడాఖా చూపిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో శుక్రవారం ఎస్సై శ్రీను కుటుంబాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం పరామర్శించింది. శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. సీఐ, సిబ్బంది వేధింపులు, అవమానాలు భరించలేక ఎస్సై ఆత్మహత్య చేసుకున్నారంటే పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ఎస్సై కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలని, ఆత్మహత్య చేసుకున్న ఎస్సై కుటుంబానికి న్యాయం చేయాలని వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎస్సీ, ఎస్సీ కమిషన్ సభ్యులు నూనవత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, ఐనావత్ రాంబాబు, జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు సురేష్, ఎబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, నాయకులు చంద్రమౌళి, వైనాల అశోక్, గుండాల రాజకొరయ్య, వడ్లూరి రమేష్, బట్టు సాంబయ్య, బొట్ల నరేష్, మేడ రంజిత్, గాదపాక రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల హెచ్చరిక

- బొగత వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు


పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి బొగత జలపాతం వద్ద ప్రమాదాలకు ఎవరూ ఇబ్బందులు పడొద్దని పోలీసుల హెచ్చరిక పేరుతో శుక్రవారం పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. జలపాతంలో మొసళ్లు ఉన్నాయని, హద్దు మీరకండి..అయిన వాళ్లకు దురం కాకండి.. అని ఫ్లెక్సీల్లో రాశారు.